సాక్షి మెదక్

గురువారం । 24 । జూలై । 2025



గోపాల మిత్రలకు వేతనాలు

ఉమ్మడి జిల్లాలోని 161 మంది గోపాల మిత్రలకు ఆరునెలల వేతనాలు విడుదలయ్యాయి. వివరాలు 8లో ▸



ముగిసిన ఫుట్‌బాల్ సంరంభం

వర్గల్ నవోదయ వేదికగా మూడురోజుల పాటు కొనసాగిన సుబ్రతో కప్ జాతీయ ఫుట్‌బాల్ పోటీలు ముగిశాయి. వివరాలు 8లో ▸



పశు వైద్యం.. కడు దైన్యం

జిల్లాలో మూగజీవాలకు పశువైద్యం అందని ద్రాక్షలా మారింది. దీంతో పశు పోషకులు ఇబ్బంది పడుతున్నారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

సింగూరు నీటిని విడుదల చేయండి



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న శశిధర్‌రెడ్డి

పాపన్నపేట(మెదక్): సింగూరు నుంచి ఘనపురం ప్రాజెక్టుకు సాగు నీరు వెంటనే విడుదల చేయాలని మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం ప్రారంభమై సుమారు 53 రోజులు కావొస్తున్నా, ఇప్పటివరకు జిల్లాలో ఆశించిన వర్షాలు కురువలేదన్నారు. దీంతో ఘనపురం ఆయకట్టు రైతాంగం వేసిన వరి తుకాలు ముదిరి పోతున్నాయని వివరించారు. సింగూరు నుంచి ఘనపురం ప్రాజెక్టుకు వాటాగా రావాల్సిన 4.06 టీఎంసీలపై ఇక్కడి రైతాంగానికి పూర్తి హక్కు ఉందన్నారు. ప్రస్తుతం సింగూరులో 18.6 టీఎంసీలకుపైగా నీరు ఉన్నందున, వెంటనే 0.5 టీఎంసీల నీటిని విడుదల చేయాలని కోరారు.

కుక్కల దాడిపై విచారణ



తండాలో విచారణ చేస్తున్న సిబ్బంది

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని రూప్ల తండాలో ఇటీవల వీధి కుక్కల దాడిలో మూడేళ్ల బాలుడు మృతిచెందిన విషయంపై ఉన్నతాధికారులు స్పందించారు. ఈ మేరకు బుధవారం పీహెచ్‌సీ, పశువైద్య సిబ్బంది తండాలో విచారణ చేపట్టారు. ఐదేళ్ల లోపు పిల్లలు కుక్కల దాడిలో చనిపోతే చైల్డ్ డెత్ ఆడిటింగ్ నిర్వహించనట్లు పీహెచ్‌సీ వైద్యురాలు సాయి సౌమ్య చెప్పారు. తండావాసులతో మాట్లాడి దాడి వివరాలను నమోదు చేసుకున్నారు. జిల్లా ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని మృతిచెందిన బాలుడి తల్లిదండ్రులు, తండావాసులు కోరారు.

ఐటీఐలో ప్రవేశాలు

మెదక్ కలెక్టరేట్: మెదక్‌లోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎలక్ట్రీషియన్ (8), ఫిట్టర్ (6), డ్రాఫ్ట్‌మెన్ సివిల్ (12), మెకానిక్ డీజిల్ (12), కోపా (33) సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత గల విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మెరిట్ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుందన్నారు. విద్యార్థినులకు 33 శాతం రిజర్వేషన్ అందిస్తున్నట్లు వివరించారు.

మహిళల సంక్షేమమే లక్ష్యం



మహిళలతో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల

సంగారెడ్డిటౌన్: మహిళల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం అని టీజీఐఐసీ చైర్మన్ నిర్మల అన్నారు. బుధవారం సంగారెడ్డి ఆర్టీసీ డిపోలో ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ పథకాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకుంటున్నారని తెలిపారు. అందులో భాగంగానే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించామని చెప్పారు. జిల్లాలో ఇప్పటివరకు 3.50 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేశారన్నారు. అనంతరం మహిళలను సత్కరించి, వ్యాస రచన పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఆర్‌ఎం విజయ్‌కుమార్, డిపో మేనేజర్ ఉపేందర్, ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేతకీ హుండీ ఆదాయం రూ. 29,79,750

ఝరాసంగం(జహీరాబాద్): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కేతకీ సంగమేశ్వర ఆలయ హుండీని బుధవారం రాజరాజేశ్వర సేవా సమితి సభ్యులు లెక్కించారు. వివిధ ప్రాంతాల భక్తులు నగదు రూపంలో సమర్పించిన ఆదాయాన్ని లెక్కించగా రూ. 29,79,750 వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి చైర్మన్ చంద్రశేఖర్ పాటిల్, ఈఓ శివరుద్రప్ప, పర్యవేక్షకుడు శశిధర్, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

బీడుగా ఆయకట్టు

జిల్లాలో చినుకులే.. భారీ వర్షం లేదు

- నిండని చెరువులు, కుంటలు, వాగులు
- ఆందోళనలో అన్నదాతలు
- బోరుబావుల కింద కొనసాగుతున్న వరినాట్లు



నీరులేక వెలవెలబోతున్న మండలంలోని కిష్టాపూర్ పెద్ద చెరువు

తూప్రాన్: వాతావరణ శాఖ వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని ప్రకటనలు చేస్తున్నా.. వరుణ దేవుడు మాత్రం కరుణించడం లేదు. జిల్లాలో ఇప్పటివరకు చినుకులే తప్ప.. భారీ వర్షం కురిసిన దాఖలాలు లేవు. జలకల లేక చెరువులు వెలవెలబోతున్నాయి. వాటి కింద ఆయకట్టు బీడుగా మారింది. బోర్లలో నీరున్న రైతులు ముందస్తుగా తుకాలు పోసుకున్నారు. గొలుసుకట్టు చెరువులపై ఆధారపడి సాగు చేస్తున్న వారు దిక్కుతోచక దిక్కులు చూస్తున్నారు.

జిల్లావ్యాప్తంగా 2,327 చెరువులు

జిల్లాలో అడపాదడపా కురుస్తున్న వర్షాలతో రైతులు నారుమళ్లు సిద్ధం చేసుకున్నారు. కానీ చెరువులు, కుంటలు నిండకపోవడంతో సాగుకు సరిపడా నీరు లేక అయోమయంలో పడ్డారు. వానలు సమృద్ధిగా కురిసి చెరువులు, కుంటలు నిండితేనే వరి నాట్లు వేసే పరిస్థితి నెలకొంది. గతేడాది జూలైలో జిల్లాలోని చెరువుల్లో జలకళ కనిపించగా, ఈ ఏడాది ఇప్పటివరకు జిల్లాలో ఒక్క చెరువు కూడా నిండిన దాఖలాలు లేవు. మెట్ట పంటల సాగుకు మాత్రం వాతావరణ పరిస్థితులు కొంత మేర అనుకూలంగా ఉండగా.. వరి పండించే రైతులకు వరుణదేవుడు నిరాశే మిగిల్చాడు. జిల్లాలో వరి సాగు అంచనా 3 లక్షల ఎకరాలు వరకు ఉండగా, ప్రస్తుతం ఇప్పటివరకు సుమారు 74 వేల ఎకరాల్లో మాత్రమే సాగు అయినట్లు జిల్లా వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. గతేడాది ఈసమయంలో 249.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, ఈ ఏడాది 185.9 ఎంఎంగా నమోదైంది. జిల్లాలో 2,327 చెరువులు ఉన్నాయి. అయితే ఇప్పటివరకు చెరువుల్లోకి చుక్క నీరు వచ్చి చేరలేదు. కేవలం బోరుబావుల వద్దే రైతులు వరి సాగు చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా బోరుబావులు, హల్దీవాగు పరివాహ ప్రాంత రైతులు వరి నాట్లు వేసే పనిలో నిమగ్నం అయ్యారు. ఆగస్టులోనైనా వర్షాలు సమృద్ధిగా కురిస్తే తమ పంటలు పండుతాయన్న ఆశతో రైతులు ఉన్నారు.



ఏపుగా పెరిగిన వరినారు

జిల్లాలో పంటల సాగు వివరాలు (ఎకరాల్లో)

వరి	74 వేలు (సుమారు)
జొన్నలు	33
కంది	590
మొక్కజొన్న	1,371
పత్తి	33,800
పెసర్లు	619
మినుములు	853
స్వీట్‌కార్న్	193
పామాయిల్	900
కూరగాయలు	628

రైతులు ఆందోళన చెందొద్దు

“ ఇప్పటికే నారుమళ్లు వేసుకున్న వారు ఆగస్టులో వర్షాలు సమృద్ధిగా కురిస్తే పంట సాగు చేసుకోవచ్చు. ఆపై వర్షాలు పడితే ఆరుతడి పంటలు వేసుకోవడం ఉత్తమం. ఇప్పటికే బోరుబావుల వద్ద వరి నాట్లు వేస్తున్నారు. వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని వాతావరణశాఖ చెబుతోంది. కనుక వరి రైతులు ఆందోళన చెందొద్దు. – దేవకుమార్, జిల్లా వ్యవసాయాధికారి

అర్హులందరికీ రేషన్‌కార్డులు



పెద్దశంకరంపేటలో రేషన్‌కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి, కలెక్టర్ రాహుల్‌రాజ్

కలెక్టర్ రాహుల్‌రాజ్

పెద్దశంకరంపేట(మెదక్)/హవేళిఘణాపూర్/మెదక్ మున్సిపాలిటీ: జిల్లాలో అర్హులైన ప్రతీ పేద కుటుంబానికి రేషన్‌కార్డు అందజేస్తామని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. బుధవారం పెద్దశంకరంపేటలో లబ్ధిదారులకు మంజూరైన నూతన రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 9,960 నూతన రేషన్‌కార్డులు లబ్ధిదారులకు అందజేస్తున్నామని తెలిపారు. ఇది నిరంతర ప్రక్రియ అని, మార్పులు, చేర్పులకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదలకు ఒక్క రేషన్‌కార్డు కూడా పంపిణీ చేయలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోనికి వచ్చి న తర్వాత ఒక్కొక్క హామీని నెరవేర్చుకుంటూ వెళ్తున్నామని చెప్పారు. మండలంలో వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేయడం లేదని బీఆర్‌ఎస్ నాయకులు ధర్నా చేస్తున్నారని, నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానన్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే హవేళిఘణాపూర్ మండల పరిధిలోని సర్దన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రికి వచ్చిన రోగులకు వైద్య సేవలు, మందులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అంతకుముందు కూచన్‌పల్లి రైతు వేదికలో భూసార పరీక్షలు ఫలితాల ద్వారా రసాయన ఎరువులు వినియోగిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు.

మహిళల అభ్యున్నతికి కృషి

మెదక్ మున్సిపాలిటీ: మహిళల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం ఎనలేని కృషిని కొనసాగిస్తుందని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. మహాలక్ష్మి పథకంపై బుధవారం మెదక్ ఆర్టీసీ ప్రాంగణంలో ఆర్టీసీ సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా సంబురాలు నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 2.72 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేయడం వల్ల రూ. 81.04 కోట్లు ఆదా చేసుకున్నారని తెలిపారు. జిల్లా పరిధిలో కొత్తగా 8 బస్సులను కొనుగోలు చేసినట్లు చెప్పారు. అనంతరం వ్యాస రచన పోటీలలో గెలుపొందిన బాలికలకు బహుమతులు ప్రదానం చేశారు.

‘విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి’

జహీరాబాద్ టౌన్: ఇంటర్మీడియెట్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేశ్ అన్నారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం బంద్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం తీసుకొచ్చిందని, ప్రస్తుతం నిలిపివేశారన్నారు. ఇంటర్ బోర్డును ఎత్తివేయాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉందన్నారు. కార్పొరేట్ కళాశాలలు ఫీజు దోపిడీని నియంత్రించడం లేదన్నారు. విద్యార్థులకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పించాలన్నారు. పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బంద్ విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మహేశ్, పాల్‌రాజ్, ఆకాశ్ పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు పెద్దపీట

మంత్రి దామోదర రాజనర్సింహా

సంగారెడ్డి: స్వయం సహాయక సంఘం మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. బుధవారం పుల్కల్ మండలం సింగూరు చౌరస్తాలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటుచేసిన అందోల్ నియోజకవర్గ మహిళా శక్తి సంబరాలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చిన్న, చిన్న వ్యాపారాలు చేస్తున్న మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రభుత్వం మహిళా శక్తి కార్యక్రమం చేపట్టిందన్నారు. రాష్ట్రంలోనే మొదటి మహిళా శక్తి పెట్రోల్ బంక్‌లు సంగారెడ్డి జిల్లాలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రోజూ 5 నుంచి 6 లక్షల టర్నోవర్ సాధించడంతో పాటు 16 మంది స్వయం సహాయక సంఘాల మహిళలు ఈ పెట్రోల్ బంక్ ద్వారా ఉపాధి పొందుతున్నట్లు చెప్పారు. అలాగే మహిళా క్యాబ్ డ్రైవర్లుగా 50 మంది మహిళలకు శిక్షణ పూర్తి చేసినట్లు వివరించారు. వీరందరికీ త్వరలో రాయితీపై కార్లు ఇప్పించేలా జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, మెప్మా అధికారులు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. వీటితో పాటు వ్యవసాయ రంగంలో పురుగు మందుల పిచికారీ కోసం డ్రోన్ వినియోగంపై మహిళలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించామన్నారు. అనంతరం నియోజకవర్గ పరిధిలోని 9 మండలాలకు చెందిన స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రభుత్వం విడుదల చేసిన రాయితీ రుణాల చెక్కులను అందజేశారు. టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల మాట్లాడుతూ.. మహిళా శక్తి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అన్నారు. అలాగే అర్హులకు కొత్త రేషన్‌కార్డులను అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఆర్డీఓ జ్యోతి, ఆర్డీఓ పాండు, మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.



మహిళలు తయారు చేసిన తిను బండారాలను కొనుగోలు చేస్తున్న మంత్రి దామోదర

జిల్లాలో ఎరువుల కొరత లేదు

అదనపు కలెక్టర్ నగేశ్

చిన్నశంకరంపేట(మెదక్): జిల్లాలో ఎక్కడా ఎరువుల కొరత లేదని అదనపు కలెక్టర్ నగేశ్ అన్నారు. బుధవారం మండలంలోని గవ్వలపల్లిలోని ఎరువుల దుకాణాన్ని పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. అలాగే సూరారం శివారులోని కోళ్ల పరిశ్రమను పరిశీలించి దాణాకు ఉపయోగిస్తున్న రసాయనాలపై ఆరా తీశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిశ్రమల్లో యూరియాను నిల్వ చేస్తూ కృత్రిమ కొరత సృష్టిస్తున్నట్లు వస్తున్న వార్తల్లో నిజం లేదని తెలిపారు. రైతులు ఎరువుల కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి లక్ష్మీ ప్రవీణ్, డిప్యూటీ తహసీల్దార్ ప్రభుదాస్, ఆర్ఐ రాజు, ఏఈఓ నాగేందర్ తదితరులు ఉన్నారు.



ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

వసతిగృహాల్లో మెనూ పాటించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: ప్రభుత్వ వసతి గృహాల్లో మెనూ తప్పకుండా పాటించాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రభుత్వ వసతి గృహాల సలహా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. వసతి గృహాల్లో ఉండే విద్యార్థుల భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉందని, వారికి ప్రభుత్వం అందిస్తున్న అన్ని సదుపాయాలు అందించాలని సూచించారు. అధికారులు స్థానికంగా ఉండాలని, విద్యార్థులకు ఏమైనా ఇబ్బందులు కల్గిస్తే సహించేది లేదన్నారు. సమస్యలుంటే చెప్పాలని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని చెప్పారు. కాగా ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించిన కాస్మొటిక్ చార్జీలు విద్యార్థులకు రాకపోవడం విచారకరమన్నారు. సమావేశంలో ఎంఈఓలు బుచ్యానాయక్, తారాసింగ్, ఎస్సీ, ఎస్టీ, బీసీ శాఖల జిల్లా అధికారులు గంగాకిషన్, నీలిమ, పద్మజ, అమరజ్యోతి తదితరులు పాల్గొన్నారు. అనంతరం హత్నూర మండలానికి చెందిన పలువురికి ఎమ్మెల్యే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు.

పీఆర్సీ అమలు చేయాలి: టీపీటీఎఫ్

మెదక్‌జోన్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు రెండేళ్లు కావొస్తున్నా ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్సీ ఇవ్వకుండా జాప్యం చేస్తుందని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్రామిరెడ్డి అన్నారు. ఈ మేరకు ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని బుధవారం మెదక్ తహసీల్దార్‌కు అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల షెడ్యూల్ ప్రకటించాలని, అన్నిరకాల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపచేయాలని, జీఓ 25ను సవరించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు యాదగిరి, శ్రీనివాస్‌రెడ్డి, నాచారం శేఖర్, సురేందర్, నాగరాజు, పోచయ్య, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

మౌలిక వసతుల కల్పనకు కృషి

డీఈఓ రాధాకిషన్

మనోహరాబాద్(తూప్రాన్): విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు కల్పిస్తున్నట్లు డీఈఓ రాధాకిషన్ అన్నారు. గతంలో మూతపడి ఈ విద్యా సంవత్సరం పునఃప్రారంభమైన మండలంలోని కూచారం పంచాయతీ పరిధిలోని దిలాయి ప్రాథమిక పాఠశాలను బుధవారం సందర్శించారు. ఈసందర్భంగా పాఠశాల పరిసరాలు పరిశీలించి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో మూతపడిన పాఠశాలను స్థానికుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఈ విద్యాసంవత్సరం పునఃప్రారంభించినట్లు తెలిపారు. ప్రస్తుతం పాఠశాలకు 20 మంది విద్యార్థులు వస్తున్నారని చెప్పారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించడంతో పాటు వారికి అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంఈఓ మల్లేశం, కాంప్లెక్స్ హెచ్‌ఎం నర్సింగం పాల్గొన్నారు.

సబ్సిడీ యూరియా పక్కదారి!



కొన్ని పరిశ్రమల్లో గుట్టుగా సాగుతున్న అక్రమ వినియోగం

- టెక్నికల్ గ్రేడ్ స్థానంలో వ్యవసాయ యూరియా వాడకం?
- కొరత నేపథ్యంలో తెరపైకి వస్తున్న దందా..

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: వ్యవసాయ అవసరాలకు వినియోగించే సబ్సిడీ యూరియా పక్కదారి పడుతోందనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. నిబంధనల ప్రకారం పారిశ్రామిక అవసరాలకు టెక్నికల్ గ్రేడ్ (కమర్షల్) యూరియా వాడాలి. కానీ దాని స్థానంలో తక్కువ ధరకు సబ్సిడీపై లభిస్తున్న వ్యవసాయ యూరియాను అక్రమంగా ముడిసరుకుగా వాడుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా బొల్లారం, పాశమైలారం, ఖాజీపల్లి వంటి పారిశ్రామిక వాడల్లో కొన్ని పరిశ్రమల్లో ఇలా వ్యవసాయ యూరియాను ముడిసరుకుగా వాడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. చాలా రోజులుగా ఈ అక్రమ వాడకం కొనసాగుతుండగా.. ప్రస్తుతం యూరియా కొరత నేపథ్యంలో ఈ వ్యవహారం తెరపైకి వస్తోంది.

రైతుల ఇబ్బందులు

యూరియా కొరతతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. రెండు బస్తాల కోసం రోజంతా క్యూలైన్లలో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. చెప్పులు, పాస్‌పుస్తకాలను లైన్‌లో పెట్టి పడిగాపులు కాయాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో వ్యవసాయ అవసరాలకు వినియోగించాల్సిన యూరియా పక్కదారి పట్టకుండా పకడ్బందీగా వ్యవహరించాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది.

దొరికితేనే దొంగలు..

జిల్లాలో పలు పరిశ్రమలు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నాయి. ఆ పరిశ్రమలో తయారయ్యే ఉత్పత్తులకు సంబంధించి వివిధ ప్రభుత్వ శాఖల నుంచి తీసుకున్న అనుమతులు ఒకటి ఉంటే.. అందులో తయారయ్యే ఉత్పత్తులు మరొకటి ఉంటున్నాయి. ఇలా పాశమైలారం పారిశ్రామిక వాడలోని ఓ పరిశ్రమలో నకిలీ పాలను తయారు చేస్తున్న వ్యవహారం గతంలో పోలీసుల దాడుల్లో తేటతెల్లమైంది. ఈ పాల తయారీకి కూడా యూరియాను వాడుతున్నట్లు గుర్తించారు. అనుమతి ఒక ఉత్పత్తికి తీసుకొని.. మరో ఉత్పత్తులను తయారు చేస్తున్న కొన్ని పరిశ్రమలు.. ఇలా ముడి పదార్థాల తయారీకి సబ్సిడీ ముడి సరుకులను వాడటానికి ఏమాత్రం వెనుకాడరనే ఆరోపణలు ఉన్నాయి.

వ్యవసాయేతర అవసరాలకు ఇలా..

యూరియాను ఒక్క వ్యవసాయ అవసరాలతో పాటు, పారిశ్రామిక అవసరాలకు కూడా వినియోగిస్తారు. ఇందులో 46 శాతం నైట్రోజన్ ఉంటుంది. చిన్న చిన్న మిశ్రమాలు కలిపితే వివిధ ఉత్పత్తుల తయారీకి అవసరమైన ముడిసరుకుగా మారుతుంది. ప్రధానంగా రసాయన పరిశ్రమలు, లూబ్రికేంట్స్, ప్లాస్టిక్, రెసిన్స్, అతుక్కునే పదార్థాలు, క్రీములు, లోషన్లు, రబ్బరు వంటి పరిశ్రమలకు యూరియాను ఓ ముడిసరుకుగా వాడుతుంటారు.

అధికారుల కనుసన్నల్లోనే..?

అధికారులు, డీలర్ల కనుసన్నల్లోనే ఈ వ్యవహారం నడుస్తున్నట్లు ఆరోపణలున్నాయి. జిల్లాకు ఎరువులు సరఫరా చేసే రైల్వే రేక్‌పాయింట్ల నుంచే నేరుగా ఈ పరిశ్రమలకు లారీల్లో యూరియాను డంప్ చేస్తున్నట్లు సమాచారం. రాజకీయ పలుకుబడి ఉన్న ఓ స్థానిక నాయకుడు ఈ దందాను వెనుకుండి నడిపిస్తున్నట్లు తెలుస్తోంది. మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లో కొందరు డీలర్ల గోదాములకు డెలివరీ చేస్తున్నట్లు, వే బిల్లులతో వారానికి రెండు, మూడు లారీలు ఈ పరిశ్రమల్లో యూరియా అక్రమంగా డంప్ అవుతున్నట్లు తెలుస్తోంది.

పెయింట్, రబ్బరు, టాయిలెట్ క్లీనర్లు, శుభ్రపరిచే యంత్రాలు వంటి వాటి తయారీకి కూడా ఈ యూరియా వినియోగం ఉంటుంది.

టెక్నికల్ గ్రేడ్ యూరియాకు ఎక్కువ రేటు..

రైతులకు సరఫరా చేస్తున్న యూరియా ఎరువులపై ప్రభుత్వం పెద్ద మొత్తంలో సబ్సిడీలు భరిస్తుంది. 50 కిలోల బస్తాకు రైతుకు రూ. 266 చొప్పున విక్రయిస్తుంది. పారిశ్రామిక అవసరాలకు వినియోగించే యూరియాను టెక్నికల్ గ్రేడ్ యూరియా అని పిలుస్తారు. దీని ధర బస్తాకు రూ. 1,500 నుంచి రూ. రెండు వేల వరకు ఉంటుంది. వ్యవసాయానికి వాడాల్సిన యూరియా తక్కువ ధరకు లభిస్తుండటంతో కొన్ని పరిశ్రమలు గుట్టు చప్పుడు కాకుండా ఈ వ్యవహారాన్ని కొనసాగిస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

క్లుప్తంగా

డ్రంకెన్ డ్రైవ్‌లో 21 మందికి జరిమాన

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 21 మంది వాహన దారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించింది. పట్టుబడిన వాహనదారులను బుధవారం కోర్టులో హాజరుపరచగా ఐదుగు రికి రూ.వెయ్యి, ముగ్గురికి రూ.2వేలు, మరో 13 మందికి రూ.1,500 చొప్పున జరిమాన విధించింది. ఈ మేరకు ట్రాఫిక్ పోలీసులు మీడియాకు వెల్లడించారు.

ఎండు గంజాయి స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఎండు గంజాయి

మునిపల్లి(అందోల్): బుదేరా పోలీసులు మండలంలోని కంకోల్‌టోల్ ప్లాజా వద్ద చేపట్టిన సాధారణ వాహన తనిఖీల్లో 500 గ్రాముల ఎండు గంజాయిని పట్టుకుని స్వాధీనం చేసుకోవడంతో పాటు ఇద్దరిని అరెస్టు చేశారు. బుధవారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. 65వ జాతీయ రహదారిపై కంకోల్ టోల్‌ప్లాజాపై పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా గుంటూరు జిల్లా పిడుగురాళ్ల మండలంకు చెందిన మోజాల ఈశ్వర్ (21), సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం కవ్వెల్లి గ్రామానికి చెందిన బోయిన నిఖిల్ (19) అనే ఇద్దరు వ్యక్తులు టీవీఎస్ బైక్‌పై అటుగా వస్తున్నారు. ఈ క్రమంలో పోలీసులు వారిని తనిఖీ చేయగా వారివద్ద ఎండుగంజాయి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే ఇద్దరినీ అదుపులోకి తీసుకుని విచారించగా బీదర్‌కు చెందిన ఓ గుర్తు తెలియన వ్యక్తి వద్ద ఈ గంజాయిని కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తీసుకువస్తున్నట్లు తేలింది. నిందితుల నుంచి గంజాయితోపాటు మొబైల్ ఫోన్లను, ద్విచక్రవాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు బుదేరా ఎస్సై రాజేశ్ నాయక్ తెలిపారు.

మోతాదు మించి యూరియా వాడొద్దు

నారాయణఖేడ్: రైతులు మోతాదుకు మించి యూరియాను వాడవద్దని ఖేడ్ ఏడీఏ నూతన్ కుమార్ సూచించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ...ఎక్కువ ఎరువులు వేస్తే ఎక్కువ దిగుబడులు వస్తాయని రైతులకు యూరియాను ఎక్కువ వాడుతున్నారన్నారు. ఇక భవిష్యత్తు అవసరాలకు యూరియా దొరకదనే ఆందోళనతో యూరియాను ఎక్కువగా కొనుగోలు చేసి దాచుకుంటున్నారని దీంతో యూరియా కొరత ఏర్పడుతుందని వివరించారు. రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ అవసరాల మేరకే యూరియా వాడుకోవాలని సూచించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సంగారెడ్డి క్రైమ్: సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రిలో తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 8న ప్రభుత్వాస్పత్రిలోని అత్యవసర ద్వారం వద్ద గుర్తు తెలియని వ్యక్తి (45–50) స్థితిలో పడి ఉన్నాడు. గమనించిన సెక్యూరిటీ సిబ్బంది చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ఈనెల 22న మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రభుత్వాస్పత్రి ఆవరణలో గల పలు దుకాణాలలో భిక్షాటన చేసే వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. సెక్యూరిటీ సిబ్బంది ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. వివరాలు తెలిస్తే 8712656718 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

నర్సాపూర్‌లో ఆపరేషన్ ముస్కాన్

ఒకరిపై కేసు నమోదు



పుష్ప బిగ్ బజార్ యజమానిపై కేసు నమోదు చేస్తున్న పోలీసులు

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ పట్టణంలోని పలు దుకాణాలు, వ్యాపార సంస్థలు, హోటళ్లపై బుధవారం ఆపరేషన్ ముస్కాన్ పేరిట పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని పుష్ప బిగ్ బజార్‌లో పనిచేస్తోన్న బాల కార్మికురాలిని గుర్తించి యజమాని ఇర్ఫాన్‌పై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ముస్కాన్ 11వ టీం సభ్యుడు నర్సాపూర్ ఎస్సై జగన్నాథం మాట్లాడుతూ... సంస్థల్లో పనిచేసే వారి వయసుకు సంబంధించి ఆధారాలను సమర్పించాలన్నారు. ఎవరైనా బాలకార్మికులతో పనిచేయిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సెల్ ఫోన్ల అప్పగింత

మనోహరాబాద్(తూప్రాన్): ఇటీవల మండలంలోని పలు గ్రామాలకు చెందిన పలువురు తమ సెల్‌ఫోన్లు పోయినట్లు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ యాప్ ద్వారా పోలీసులు ట్రేస్ చేసి తొమ్మిది సెల్‌ఫోన్‌లను పట్టుకున్నారు. కాగా, సెల్ ఫోన్లు పోగొట్టుకున్న ఆ తొమ్మిదిమందికి పోలీసులు ఆ సెల్‌ఫోన్లను అప్పగించారు. ఈ మేరకు ఎస్సై సుభాష్‌గౌడ్ మీడియాకు వెల్లడించారు.

గోపాల మిత్రలకు వేతనాల విడుదల

6 నెలల వేతనం

రూ.1.06కోట్లు జమ

- ఉమ్మడి జిల్లాలో 161మందికి మేలు
- ప్రాసెస్‌లో మరో 3నెలల వేతనం
- హర్షం వ్యక్తం చేస్తున్న గోపాల మిత్రలు

నారాయణఖేడ్: వేతనాలు అందక పశుసంవర్ధక శాఖలో విధులు నిర్వహిస్తూ ఇబ్బందులు పడుతున్న గోపాల మిత్రలకు ఆరునెలల వేతనాలు విడుదలయ్యాయి. ఉమ్మడి జిల్లా పరిధిలోని 161మంది గోపాల మిత్రలకు ఆరునెలలకు సంబంధించి రూ.1,06,74,300ల వేతనాల మొత్తాన్ని ప్రభుత్వం విడుదల చేసింది. మరో మూడునెలల వేతనం రూ.53,37,150లు త్వరలో విడుదల కానున్నాయి. దీంతో వేతనాలు అందక ఇన్నాళ్లు ఇబ్బందులు పడుతూ విధులు నిర్వర్తిస్తూ కుటుంబాలను నెట్టుకొస్తున్న గోపాల మిత్రల్లో ఆనందం నెలకొంది. వేతనాలకోసం నాయకులు, అధికారులకు పెట్టుకున్న మొరలకు ఫలితం దక్కిందని పేర్కొంటున్నారు. వేతనాలు అందక గోపాల మిత్రలు పడుతున్న ఇబ్బందులను 'సాక్షి'దినపత్రికలో ఈనెల 16న 'గోపాల మిత్రల గోడువినరేం!'శీర్షికన కథనం ప్రచురితమైంది. తమ దుస్థితిని జిల్లా అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం పట్ల 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

ఉమ్మడి జిల్లా వారీగా ఉన్న గోపాల మిత్రలు, విడుదలైన వేతనం

జిల్లా	గోపాల మిత్రలు	విడుదలైన వేతనం రూ.
సిద్దిపేట	61	40,44,300
సంగారెడ్డి	45	29,83,500
మెదక్	55	36,46,500
మొత్తం	161	1,06,74,300



పశువుకు కృత్రిమ గర్భధారణ నిర్వహిస్తున్న గోపాలమిత్ర

ఆరు నెలల వేతనాలు విడుదల



ఉమ్మడి జిల్లాలోని 161మంది గోపాల మిత్రలకు ఆరునెలల వేతనాలు ప్రభుత్వం విడుదల చేసింది. పెండింగ్‌లో ఉన్న మరో మూడు నెలల వేతనాలు త్వరలో విడుదల కానున్నాయి. వేతనాలు బిల్ చేసి పంపించగా గోపాల మిత్రల ఖాతాల్లో హెడ్ ఆఫీసు నుంచి వారి వారి ఖాతాల్లో జమయ్యాయి. –రాంజీ, ఎగ్జిక్యూటీవ్ అధికారి, మెదక్

జోరుగా ట్రేడ్ లైసెన్స్ దందా

- పట్టించుకోని యంత్రాంగం
- డిజిటల్ సంతకాలు లేని 40 సర్టిఫికెట్లు గుర్తించిన వైనం
- చక్రం తిప్పుతున్న ఓ అధికారి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): చిన్న దుకాణాల నుంచి షాపింగ్‌మాల్ వరకు ఏ వ్యాపారం చేసినా తప్పనిసరిగా మున్సిపాలిటీ నుంచి వ్యాపార అనుమతి (ట్రేడ్ లైసెన్స్)ను తప్పనిసరిగా తీసుకోవాలి. దుకాణం, వాణిజ్య సముదాయం ముందున్న రోడ్డును బట్టి ప్రభుత్వం రుసుము విధిస్తుంది. దుకాణదారులు ఆ రుసుము చెల్లించి ట్రేడ్ లైసెన్స్ సర్టిఫికెట్‌ను తీసుకుంటారు. అయితే తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో కొత్త కొత్త కాలనీలు రావడంతో ఈ ప్రాంతం వాణిజ్య కేంద్రాలకు నిలయంగా మారుతుండటంతో ట్రేడ్ లైసెన్స్‌కు మంచి డిమాండ్ వచ్చింది. అయితే కొంతమంది వ్యాపారులు డిజిటల్ సంతకం లేకుండానే ట్రేడ్ లైసెన్స్ సర్టిఫికెట్లు తీసుని తమ వ్యాపారాలు నిర్వహిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. డిజిటల్ సైన్ లేని ట్రేడ్ లైసెన్స్‌లను తీసుకుంటున్న వారిని నియంత్రించడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు.

జోరుగా వ్యాపార సముదాయాలు

తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని గ్రామాలలో గేటెడ్ కమ్యూనిటీ కాలనీలు, బహుళంతస్తుల భవనాలు వస్తున్నాయి. గత కొన్ని నెలల క్రితం మున్సిపల్‌లో విలీనమైన 5గ్రామాలలో సైతం అనేక నూతన కాలనీలు అభివృద్ధి చెందుతున్నాయి. దాంతో ఈ ప్రాంతాల్లో ప్రజల అవసరాలకనుగుణంగా వ్యాపార సముదాయాలను వ్యాపారస్తులు ఏర్పాటు చేస్తున్నారు. హోటళ్లు, మాంసం దుకాణాలు, ఫుడ్‌కోర్టులు, మాల్స్ ఇతర వ్యాపార సంస్థలు వెలుస్తున్నాయి.



తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయం

ఆన్‌లైన్‌లో దరఖాస్తులు..

దుకాణారులు ట్రేడ్‌లైసెన్స్ పొందేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటారు. ఆ దరఖాస్తు మున్సిపల్ ఉన్నతాధికారి లాగింగ్‌లోకి పోతుంది. దానిని సంబంధింత అధికారి లాగింగ్‌లోకి పంపిస్తారు. కిందస్థాయి అధికారి ఆ దరఖాస్తును పూరిస్థాయిలో పరిశీలించి విచారణ చేస్తారు. అందులోని వివరాలు సరిగా లేనిపక్షంలో దరఖాస్తును తిరస్కరించడం అన్నీ సక్రమంగా ఉంటే దానిని విచారణ చేసి తిరిగి ఉన్నతాధికారి లాగింగ్‌లోకి పంపించడం చేస్తారు. ఆ అధికారి దానిని పరిశీలించి డిజిటల్ సంతకంతో ట్రేడ్ లైసెన్స్‌ను అప్రూవ్ చేస్తారు.

డిజిటల్ సంతకాలు లేకుండా...

తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని తెల్లాపూర్, ఉస్మాన్‌నగర్, కొల్లూరుతోపాటు కొన్ని నెలల క్రితం మున్సిపల్‌లోకి విలీనంమైన ముత్తంగి, కార్ధనూర్, పాటి ప్రాంతాలలో అనేక వాణిజ్య కేంద్రాలు, చిన్న చిన్న దుకాణాలు అధికంగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో ట్రేడ్ లైసెన్స్‌లకు మంచి డిమాండ్ ఏర్పడింది. దీంతో కొంతమంది ఇష్టానుసారంగా డిజిటల్ సంతకంలేని సర్టిఫికెట్‌లు జారీ చేస్తున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. మున్సిపల్ కార్యాలయం అడ్డాగానే ఈ దందా జరుగుతుందోని ఆరోపణలు వస్తున్నాయి.

ఉన్నతాధికారులు స్పందించాలి

పలుకుబడి ఉన్న అధికారులు ఇక్కడ పనిచేయడం వల్ల ఇక్కడ ఏం చేసినా నడుస్తుందనే ధోరణిలో పలువురు అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో అవినీతికి అడ్డు అదుపు లేకుండా పోయిందని ఆరోపిస్తున్నారు. మున్సిపల్‌పై విజిలెన్స్, ఏసీబీ అధికారులు దృష్టి సారిస్తే అనేక విషయాలు బయటకు వస్తాయని చెబుతున్నారు.

చక్రం తిప్పుతున్న ఓ అధికారి..

తెల్లాపూర్ మున్సిపల్‌లో ఇతర శాఖ నుంచి వచ్చిన ఓ అధికారి పూర్తిస్థాయిలో చక్రం తిప్పుతున్నట్లు సమాచారం. గతంలో ఆ అధికారిపై పలు అవినీతి ఆరోపణలున్నప్పటికీ ఉన్నతాధికారులు సదరు అధికారికే పెద్దపీట వేస్తున్నారన్న ఆరోపణలు విన్పిస్తున్నాయి.

విచారణలో వెలుగు చూస్తున్న విషయాలు

అయితే విషయం తెలుసుకున్న ఉన్నతాధికారులు ఈ ట్రేడ్ లైసెన్స్ దందాపై విచారణ చేయగా...ఇప్పటివరకు సుమారు 40 వరకు డిజిటల్ సంతకాలు లేని సర్టిఫికెట్లను గుర్తించినట్లు చెబుతున్నారు. ఎక్కువగా తెల్లాపూర్, ముత్తంగి ప్రాంతాల్లో ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఇవి గతంలో జారీ చేసినట్లు అధికారులు చెబుతున్నప్పటికీ గత 5 నెలలుగా ఈదందా జోరందుకుందని స్థానికులు చర్చించుకుంటున్నారు. వీటికి సంబంధించిన ఫైల్స్ సైతం కనిపించడంలేదని అధికారులే చెబుతుండటం విశేషం.

విచారణ చేస్తున్నాం



కొద్ది రోజుల క్రితమే బదిలీపై వచ్చి ఉద్యోగ బాధ్యతలు చేపట్టాను. ఈ విషయం నాదృష్టికి వచ్చిన వెంటనే విచారణ మొదలుపెట్టాం. ఇప్పటివరకు 40 వరకు డిజిటల్ సంతకం లేని సర్టిఫికెట్‌లను గుర్తుంచాము. అందుకు సంబంధించిన రికార్డులు దొరకడం లేదు. పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నాం.

–అజయ్‌కుమార్‌రెడ్డి, కమిషనర్, తెల్లాపూర్ మున్సిపల్



పోచమ్మకు బోనమెత్తి

ఆషాఢ మాసం పురస్కరించుకుని నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులతో కలసి విద్యార్థులు బుధవారం పోచమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించారు. విద్యార్థులు పోతరాజు వేషధారణతో నృత్యాలు చేస్తూ ఊరేగింపులో పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతీ సాంప్రదాయాలపై విద్యార్థులకు అవగాహన పెంపొందించేందుకు కళాశాలలో బోనాల పండుగను జరిపినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదెప్ప వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 2 సభ్యులతోపాటు విద్యార్థులు, ప్రోగ్రాం అధికారి డాక్టర్ సురేశ్, అధ్యాపకుడు రమేశ్, రవికుమార్, హేమంత్ పాల్గొన్నారు. –నర్సాపూర్ రూరల్

వందరోజుల ప్రణాళిక పనులపై ఆరా

ప్రత్యేక అధికారి చంద్రశేఖర్

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీలో వందరోజుల ప్రణాళిక కార్యక్రమాలు జోరుగా కొనసాగుతున్నాయి. బుధవారం పట్టణ పరిధిలో చేపట్టిన కార్యక్రమంలో ప్రత్యేక అధికారి చంద్రశేఖర్ కమిషనర్ కిషన్‌తో కలిసి పర్యవేక్షించారు. భువన్ సర్వేలో భాగంగా శిథిలావస్థలో భవనాలను, పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. పురాతన భవనాల్లో నివసించే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. వివిధ వార్డుల్లో పరిశుభ్రత పనులపై ఆరా తీశారు.



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న చంద్రశేఖర్

కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

జ్ఞాన కేంద్రం ప్రారంభం

హత్నూర (సంగారెడ్డి): అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రమైన హత్నూరలో జ్ఞాన కేంద్రాన్ని ఆ సంఘం ఉపాధ్యక్షుడు శ్రీధర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కేంద్రం విద్యకు, సమాజ అభివృద్ధికి, యువతకు మార్గనిర్దేశనం చేస్తుందన్నారు. జ్ఞాన కేంద్రం ద్వారా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, వనరులు, కంప్యూటర్ సదుపాయాలు, విద్యా మౌలిక సదుపాయాలు, ప్రేరణాత్మక శిక్షణలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో యువజన నాయకులు, రవి, దుర్గేష్, ఎల్లయ్య, శేఖర్,యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



జ్ఞాన కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అంబేడ్కర్ సంఘం నాయకులు

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

డీఎంహెచ్ఓ గాయత్రీదేవి

కల్హేర్(నారాయణఖేడ్): డాక్టర్లు, వైద్య సిబ్బంది ఆస్పత్రుల్లో అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన సేవలు అందజేయాలని డీఎంహెచ్ఓ గాయత్రీదేవి సూచించారు. సిర్గాపూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె బుధవారం తనిఖీ చేశారు. సిర్గాపూర్‌లో కొత్తగా నిర్మించిన పీహెచ్‌సీ భవనం, వసతులను పరిశీలించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యులకు, సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ సంధ్యారాణి, డాక్టర్ ప్రతిభ, సిబ్బంది రాంచందర్ పాల్గొన్నారు.



పీహెచ్‌సీని పరిశీలిస్తున్న గాయత్రీదేవి

అదుపుతప్పి కల్వర్టులోకి జారిన లారీ

చేగుంట(తూప్రాన్): సున్నం లోడుతో వెళ్తున్న ఓ లారీ అదుపు తప్పి కల్వర్టులోకి పడిపోయింది. తూప్రాన్ మండలంలోని రాంపూర్ శివారులో బుధవారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. రాజస్థాన్ నుంచి నుండి సిద్దిపేటకు సున్నం లోడుతో వెళ్తున్న లారీ రాంపూర్ శివారులో నిర్మాణంలో ఉన్న కల్వర్టు వద్ద మలుపు తిరుగుతుండగా రోడ్డు దిగ్గిపోయి అదుపు తప్పింది. దీంతో లారీ వెనుకభాగం కల్వర్టులోకి దిగబడిపోయింది. స్థానికల సహకారంతో క్రేన్లను తెప్పించి లారీని బయటకు తీశారు. దీంతో దౌల్తాబాద్ వైపు వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.



కల్వర్టులోకి ఒరిగిపోయిన లారీ

ముగిసిన ఫుట్‌బాల్ పోటీలు



అండర్-17 విజేత పాట్నా రీజియన్ జట్టుకు కప్పు అందిస్తున్న నిర్వాహకులు



అండర్-15 విజేతగా నిలిచిన పాట్నా జట్టుకు కప్పు అందజేస్తున్న అతిథులు

వర్గల్(గజ్వేల్): ఫుట్‌బాల్ సంరంభం అంబరాన్ని తాకింది. సుబ్రతో కప్ టోర్నీపేరుతో సాగిన జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శనతో పాట్నా రీజియన్ చాంపియన్‌షిప్ సాధించింది. టోర్నీలో అండర్-15, అండర్-17 రెండు జట్లు ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి సుబ్రతో పోటీలకు ఎంపికయ్యాయి. కాగా, ఉమ్మడి మెదక్ జిల్లా వర్గల్ నవోదయ వేదికగా మూడురోజుల పాటు కొనసాగిన సుబ్రతో కప్ జాతీయ ఫుట్‌బాల్ పోటీలు బుధవారం విజయవంతంగా ముగిశాయి. జాతీయ సమైక్యత, క్రీడాస్ఫూర్తిని చాటుతూ భోపాల్, చండీఘర్, హైదరాబాద్, జైపూర్, లక్నో, పాట్నా, పుణె, షిల్లాంగ్ రీజియన్ల నుంచి వచ్చిన నవోదయ విద్యార్థులు ఆటలపోటీల్లో తమ ప్రతిభ పాటవాలు ప్రదర్శించారు.

ఢిల్లీలో జరిగే సుబ్రతో కప్ పోటీలకు పాట్నా జట్టు

- పాట్నాకు దక్కిన చాంపియన్‌షిప్
- ద్వితీయ స్థానంలో షిల్లాంగ్
- నవోదయలో వెల్లివిరిసిన క్రీడానందం

పాట్నా జట్లే ఫైనల్ విజేతలు

ఫుట్‌బాల్ టోర్నీలో చివరిరోజు అండర్-15, అండర్-17 విభాగంలో ఫైనల్ పోటీలు జరిగాయి. వర్షం కారణంగా పోటీల నిర్వహణకు కొంత ఆలస్యమైంది. అండర్-15 విభాగం ఫైనల్స్‌లో పాటాన్, షిల్లాంగ్ రీజియన్ జట్ల మధ్య హోరాహోరీ పోరు కొనసాగింది. తుది సమయం వరకు ఇరుజట్లు సమంగా నిలవడంతో షూటవుట్ విధానం చేపట్టారు. దీంతో 4-1 గోల్స్‌తో పాట్నా జట్టు, షిల్లాంగ్‌పై విజయం సాధించింది. అదేవిధంగా అండర్-17లో పాట్నా, షిల్లాంగ్ జట్లే తలపడగా 2-0 గోల్స్‌తో పాట్నా గెలుపొందింది.

ఘనంగా ముగింపు వేడుకలు

టోర్నమెంట్ ముగింపు వేడుకలు బుధవారం సాయంత్రం ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథులుగా జిల్లా క్రీడలు, యువజన శాఖాధికారి వెంకటనర్సయ్య, ములుగు అటవీ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ మమత, ప్రిన్సిపాల్ దాసి రాజేందర్ బృందం విజేతలకు మెడల్స్, కప్పులు అందజేశారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడారంగంలోనూ ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

శ్రావణం.. శుభకరం

చిన్నకోదూరు(సిద్దిపేట): శ్రావణ మాసంతోనే హిందూ సాంప్రదాయాల ప్రకారం పండుగలు ప్రారంభమవుతాయి. శ్రావణం శుభకరం అని కూడా అంటారు. ఈ మాసంలో రోజూ పండుగేనని ప్రతీ ఘడియ లక్ష్మి కటాక్షమే అని విశ్వసిస్తారు. ఈ మాసంలో చేసే అన్ని పూజల్లోకెల్లా వరలక్ష్మి వ్రతాన్ని ఉత్తమమైనదిగా పేర్కొంటారు. శుక్రవారం నుంచి శ్రావణమాసం ప్రారంభం కాగా, ఈ నెల 29న నాగుల పంచమి, వచ్చే నెల 8న వరలక్ష్మి వ్రతం, 9న శ్రావణ పౌర్ణమి(రాఖీ పండుగ), 16న శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తారు.

మంగళ, శుక్ర, శనివారాలకు ప్రాధాన్యత

శ్రావణమాసంలోని మంగళ, శుక్ర, శనివారాలు అత్యంత పుణ్యప్రదమైనవి భక్తులు నమ్ముతారు. మంగళవారాలు శ్రీగౌరీ, శుక్రవారాలు శ్రీలక్ష్మి, శనివారాలు శ్రీమహావిష్ణువు పూజలకు ముఖ్యమైన రోజులు. వీటికి తోడు శ్రావణంలోని శుక్ల పక్షంలోని 15 రోజులు ఎంతో విశేషమైనవి. సకల ఉపచారాలతో నిష్ఠగా మహాలక్ష్మివ్రతం నిర్వహిస్తారు. తొమ్మిది సంఖ్యకు ఈ వ్రతంలో ప్రాధాన్యత. అందుకే తొమ్మిది పోగులతో కూడిన తోరం ధరించి తొమ్మిద రకాల పిండి వంటలు లక్ష్మిదేవికి నివేదన చేసి ముత్తైదువులకు వాయినమిస్తారు.



ఇంట్లో వ్రతాలు నిర్వహిస్తున్న దృశ్యం(ఫైల్)

మహిమాన్వితం శ్రావణ పున్నమి

శ్రావణ మాసం పౌర్ణమి ఎంతో మహిమ కలిగినదని చెబుతారు. గాయత్రీ ఉపాసన చేసే వారు నూతన యజ్ఞోపవీతాలను ఇదే రోజున ధరిస్తారు. సర్వ విద్యా స్వరూపుడైన హయగ్రీవుని జయంతి కూడా ఇదే రోజు. రక్షా బంధనం, రుషి తర్పణం వంటి వైదిక కర్మలు ఇదే రోజున ఆచరిస్తారు. ఎంతో మహిమాన్వితమైన ఈ తిథినాడు పూజిస్తే సత్ఫలితాలుంటాయని పురాణాలు చెబుతున్నాయి.

రోజూ పండుగే..

- ప్రతీ తిథి దివ్యముహూర్తమే
- రేపట్నుంచి శ్రావణమాసం

పరమపవిత్రం శ్రావణం



హిందువుల పరమ పవిత్రం శ్రావణ మాసం. ఈ మాసం పండుగలకు ప్రత్యేకమైనదిగా చెప్పవచ్చు. ప్రతీ హైందవ ఇంట్లో ఈ నెలంతా పూజలు, వ్రతాలు నిర్వహిస్తుంటారు. దేవాలయాల్లో సామూహిక కుంకుమార్చనలు, తులసి అర్చనలు, పుష్పార్చనలు, రుద్రాభిషేకాలు వంటి పూజలు చేస్తారు.

–సదాశివ శర్మ, పురోహితులు, చిన్నకోదూరు

బీసీలకు 42% రిజర్వేషన్ కల్పించాలి

బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్



గోవా మహాసభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్‌గౌడ్

సంగారెడ్డి: బీసీలకు 42% రిజర్వేషన్ కల్పించాల్సిందేనని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రం సంగారెడ్డిలో బుధవారం నిర్వహించిన బీసీ సంఘం సమావేశానికి శ్రీనివాస్‌గౌడ్ హాజరై మాట్లాడారు. ఈ ఏడాది గోవా జాతీయ ఓబీసీ మహాసభ ఆగస్టు 7న జరుగుతుందని ఈ సభకు అన్ని పార్టీల, రాష్ట్రాల మాజీ సీఎంలు హాజరుకానున్నారని తెలిపారు. బీసీలకు 42%రిజర్వేషన్లు కల్పించేందుకు రాష్ట్రంలోని కాంగ్రెస్‌నాయకులు ఢిల్లీకి అఖిలపక్షంగా వెళ్లి రిజర్వేషన్లను ఆమోదింపజేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో రిజర్వేషన్ బిల్లు పెట్టి మూడు నెలలు గడిచినా ఇప్పటికీ ఆమోదం తెలపడం లేదని మండిపడ్డారు. పార్లమెంట్‌లో కాంగ్రెస్ నాయకులు పట్టుపట్టి బీసీలకు42% రిజర్వేషన్లు వచ్చేంతవరకు పోరాటం చేయాలని కోరారు. అంతకుముందు గోవా సభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను జాజుల ఆవిష్కరించారు. బీసీ రిజర్వేషన్ సాధన కోసం బీసీలంతా ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కులుకచర్ల శ్రీనివాస్, కూన వేణుగోపాల్, జిల్లా అధ్యక్షుడు యాదగిరి, మాజీ మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్య, గోరుగంటి రమేష్, జగదీశ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.